**కథ**

''నమస్తే. నా పేరు రామచంద్రరావు''

# మీరు నాకు నచ్చారు

''కూర్చోండి.'' కుర్చీ చూపించాడు శేఖర్. ఆయన కూర్చొని చెప్పాడు.

''నేను అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి మార్చి నెలలో రిటైర్ అయ్యాను. నా ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ పేపర్లు మీ వద్దకు వచ్చాయని తెలిసింది. మీరు కాస్త దయవుంచి ఆ పేపర్లు మూవ్ చేస్తే నాకెంతో సహాయం చేసినవారవుతారు.''

''అవి నా దగ్గరకు వచ్చి వారం రోజులే అయింది. మీరు తొందరపడినా లాభం లేదు.''

''ఇది తొందర కాదు బాబూ. అవసరం. చదువు పూర్తయిన మా అబ్బాయికి యింకా ఉద్యోగం దొరకలేదు. ఈ డబ్బు కోసం నాలుగు ప్రాణాలు ఎదురు చూస్తున్నాయి.''

''ఎవరి ప్రాబ్లమ్స్ వారికున్నాయి. మీకు రావాల్సిన డబ్బులు లెక్కలు వేశాము. మీరు అందులో ఐదు శాతం చెల్లిస్తే మీ పని చాలా త్వరగా అయిపోతుంది.''

''ఐదు శాతం. అంటే ఇరవై వేలు. సారీ. నావల్లకాదు. యు టేక్ యువర్ ఓన్ టైమ్. నేను ఆగుతాను'' కోపం అణచుకొంటూ అన్నాడు రామచంద్రరావు.

''మీరు ఆగినా, ఆగకపోయినా చెల్లించడం మాత్రం తప్పదు. అలా కాని పక్షంలో మీ పేపర్లు యీ జన్మకు పాస్ కావు.''

''అలా ఆపే అధికారం మీకు లేదు'' స్వరం పెంచుతూ అన్నాడు రామచంద్రరావు.

''ఆపగలము. ఎలా అంటారా. మీ పర్టిక్యులర్స్ పూర్తిగా లేవని మీ డిపార్ట్‌మెంట్‌కు త్రిప్పి పంపుతాం. వాళ్ళు అవి మాకు పంపిస్తే మళ్ళీ ఏదో ఒక సాకుతో తిరిగి పంపిస్తాం. మీరు ఆ అయిదు శాతం చెల్లించేదాకా ఆ పేపర్లు మానుంచి మీ డిపార్ట్‌మెంట్‌కీ అక్కడ నుంచి యిక్కడికీ తిరుగుతూనే వుంటాయి'' వెటకారంగా నవ్వుతూ అన్నాడు శేఖర్

''ఇది చాలా అన్యాయం బాబూ. మేము ఎన్నో ఏళ్ళుగా జీతం నుంచి దాచుకొన్న డబ్బులు అవి. దానిలో వాటా కోరడం న్యాయం కాదు. అటువంటి డబ్బు మీకు చెడు చేస్తుందే తప్ప మంచి చేయదు''

''ఆ డబ్బు నేనొక్కడ్నే తీసుకోవడం లేదు. మా వాళ్ళందరికీ పంచాలి. నిజానికి యిలాంటి వన్నీ ఎలాంటి గొడవలూ లేకుండా సైలెంట్‌గా జరిగిపోతూంటాయి. మీరొక్కరే యిలా మొండిగా మాట్లాడుతున్నారు''

రామచంద్రరావు ఏమీ మాట్లాడకపోవడం చూసి ''మీరు యిక వెళ్ళొచ్చు. బాగా ఆలోచించుకొని రెండు రోజుల్లో ఏ విషయం నాకు చెప్పండి'' అన్నాడు.

అసహనంగా అతని వైపు చూసి బయటకు నడిచాడు రామచంద్రరావు.

అతన్ని చూస్తున్న శేఖర్‌కూ బాధేసింది. 'తను ఇంత కఠినంగా మాట్లాడకుండా ఉండాల్సింది' అనుకొన్నాడు.

డీలాపడ్డ ముఖంతో యింటికి వచ్చిన తండ్రిని చూసి కంగారు పడింది రాధిక.

''నాన్నా... ఏమిటలా ఉన్నారు'' ఆత్రుతగా అడిగింది. ఆయనేమీ బదులివ్వక కుర్చీలో కూర్చున్నాడు. రాధిక గబగబ వంటింట్లోకి వెళ్ళి నీళ్ళు తెచ్చి యిచ్చింది. అది త్రాగి రాధిక వైపు చూస్తూ-

''పిచ్చి తల్లి. ఎందుకంత కంగారు. ఎండనపడి వచ్చాను కదా. కొద్దిగా అలసట. అంతే'' అన్నాడు ఆమె తల నిమురుతూ. ఆమె అభిమానానికి అతనికి కళ్ళనీళ్ళు వచ్చాయి. చిన్న వయసులోనే బాధ్యతలు తెలుసుకొని అనారోగ్యపు తల్లికి అన్నిట్లో సహాయం చేస్తూ, తండ్రి పనులు, అన్న పనులు ఎంతో ఓపికగా చేసిపెడుతూ, బాగా చదువుకొని మంచి ర్యాంకులతో చదువు పూర్తి చేసింది. ఆమెను ఆందోళన పెట్టడం యిష్టం లేక అసలు విషయం ఆమెకు చెప్పలేదు. భార్యతో మాత్రం జరిగింది చెప్పి బాధపడ్డాడు.

ఆ రాత్రి భోంచేశాక చాలాసేపు తన ప్రావిడెంట్ ఫండ్ గురించే ఆలోచిస్తూండిపోయాడు రామచంద్రరావు. శేఖర్ అన్న మాటలు అతన్ని చాలా బాధపెట్టాయి. ధనార్జన తప్ప మానవత్వపు విలువలు, జాలి, దయ, సమాజంలో అడుగంటిపోవడం ప్రజల దురదృష్టం.

ప్రపంచం మారిపోయింది. ప్రజలూ మారిపోయార్లు. తనే మారలేదు. ఇప్పుడు ఏం చేయాలి. మళ్ళీ శేఖర్‌నే అభ్యర్థించి పనిచేసుకోవాలా. అతను అడిగిన డబ్బు చెల్లించాలా. ఆ పని తను చేయలేడు. తను ఏనాడూ లంచం తీసుకోలేదు. ఇవ్వడం కూడా తెలియదు. పోనీ తన మనసుకు సర్దిచెప్పుకొని యిచ్చేద్దామన్నా అది చిన్న మొత్తం కాదు- ఆలోచనల వల్ల చాలా ఆలస్యంగా నిద్రపట్టింది అతనికి.

''అన్నయ్యా నాన్న గుండెనొప్పితో బాధపడుతున్నారు. త్వరగా రా'' అన్న సురేష్‌ని నిద్రలేపింది రాధిక.

గుండె దగ్గర చేయి పెట్టుకొని బాధను బిగపట్టి కూర్చుని ఉన్నాడు రామచంద్రరావు. వెంటనే హాస్పిటల్‌లో చేర్పించారు. 'మాసివ్ హార్ట్ అటాక్' వచ్చిందని, రెండు రోజులు గడిస్తేగాని ఏమీ చెప్పలేమని డాక్టర్లు చెప్పారు. భగవంతుడినే ధ్యానిస్తూ, తల్లికి ధైర్యం చెప్తూ, హాస్పిటల్‌కూ, ఇంటికీ మధ్య తిరుగుతూ ఉండిపోయారు అన్నాచెల్లెళ్ళు.

★ ★ ★

తలుపు తెరిచిన శేఖర్ ఎదురుగా ఉన్న అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాడు. అందంగా, అమాయకంగా ఉంది అమ్మాయి.

''మీరు...?''

''శేఖర్ అంటే మీరేనా''

''అవును. రండి లోపలికి'' ప్రక్కకు జరిగి ఆమెను ఆహ్వానించాడు. ఆమె లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుంది.

''చెప్పండి. ఏం పనిమీద వచ్చారు?''

''మిమ్మల్ని ఓ సహాయం కోరడానికి వచ్చాను''

''అడగండి. వీలైతే తప్పకుండా చేస్తాను''

''నా పేరు రాధిక. రామచంద్రరావుగారి అమ్మాయిని నేను''

''ఏ రామచంద్రరావు?''

''ఎవరి పెన్షన్ పేపర్లు మీ సీటుకు వచ్చి, లంచం కోసం మీరు ఆపేశారో ఆ రామచంద్రరావు కూతుర్ని''

అప్పుడు గుర్తొచ్చింది శేఖర్‌కు.

''అయితే?'' అన్నాడు సీరియస్‌గా

''లంచం తీసుకోకుండా ఆయన పేపర్లు పాస్ చేయమని అడగడానికి రాలేదు నేను. మీకో

మాట్లాడిన తర్వాత నాన్నగారు చాలా బాధపడ్డారు. తన కష్టార్జితం ఒక వ్యక్తి స్వార్థం వల్ల, అత్యాశవల్ల నిలిచిపోయిందని, తన సంసారానికి నోటి వరకు వచ్చిన అన్నం నోటి దగ్గరే ఆగిపోయిందని కుమిలిపోయారు. దాని ఫలితంగా ఆయనకు గుండెపోటు వచ్చింది. రెండు రోజులు కోమాలోనే ఉన్నారు. ఇప్పుడే స్పృహ వచ్చింది.''

వింటున్న శేఖర్ ఫీలయ్యాడు. తన వల్ల ఒక వ్యక్తికి గుండెపోటు వచ్చిందన్న నిజం అతను జీర్ణించుకోలేకపోయాడు.

''నేను కోరేది ఒకటే. మీరు ఒకసారి హాస్పిటల్‌కు వచ్చి నాన్నగారితో మాట్లాడండి. మీ తప్పు తెలుసుకొన్నానని, నయాపైసా కూడా తీసుకోకుండా పెన్షన్ పేపర్లు పాస్ చేయిస్తానని చెప్పండి. అలా చెప్తే ఆయన కోలుకొని బ్రతుకుతాడని నా ఆశ. మీరడిగిన డబ్బు నేను, నా అన్నయ్య మీకు తప్పకుండా యిచ్చేస్తాం. ఎక్కడైనా వడ్డీకి తీసుకొని అయినా సరే. అది యిచ్చాకే మీరు సంతకం పెట్టండి. ప్లీజ్. మా నాన్నని బ్రతికించండి.''

ఆమె రెండు చేతులూ జోడించింది ఏడుస్తూ.

''అలాగే వస్తాను. మీరు ముందు ఏడుపు ఆపండి''

ఆమె ఆపలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూనే వుంది.

''మీ నాన్నకేం కాదు. మీరు ధైర్యంగా ఉండండి. మీరు ఎలా వచ్చారు?''

''ఆటోలో''

''నా బైక్‌లో రాగలరా''

అలాగే నన్నట్టు తలూపింది. అయిదు నిముషాల్లో రెడీ అయి వచ్చాడు శేఖర్. హాస్పిటల్ దగ్గరగానే ఎదురొచ్చాడు సురేష్.

''రాధీ. నాన్న మనకిక లేరు'' అంటూ ఏడ్చేసాడు.

''నాన్నా'' అంటూ రాధి కూడా ఏడ్చేసింది.

శేఖర్‌కు ఏం చేయాలో తోచలేదు. ''ఏమండీ. మీరే అలా అయిపోతే ఎలా? ఎలాగో ధైర్యం తెచ్చుకొని మీ చెల్లెల్ని సముదాయించండి'' అన్నాడు సురేష్‌తో.

ఇద్దరూ అతన్ని ఓ పురుగును చూసినట్లు చూశారు. శేఖర్ వాళ్ళవైపు సూటిగా చూడలేకపోయాడు. వెళ్ళిపోదామనుకొన్నా అతని మనసు ఒప్పుకోలేదు. మౌనంగా వాళ్ళిద్దర్నీ అనుసరించాడు రామచంద్రరావును చివరిసారిగా చూడటానికి.

★★★



ఇంట్లో అడుగుపెట్టిన శేఖర్‌ని అతడు ఊహించినట్లుగానే ఎవరూ రమ్మని ఆహ్వానించలేదు. సురేష్, రాధిక ఏదో మాట్లాడుకొంటున్నారు. శేఖర్‌ని చూసి ఏమిటన్నట్టు చూశారు.

తనే ఒక కుర్చీ లాక్కొని వాళ్ళకెదురుగా కూర్చుని అన్నాడు.

'మీకు నా మీద కోపం ఉండటం సహజం. అందుకు నేను అర్హుణ్ణే. ఇప్పుడు మీ యింటికి వచ్చింది మాత్రం డబ్బులు వసూలు చేయడానికి కాదు. మీ నాన్న మరణం మిమ్మల్నెంత బాధించిందో నన్నూ అంతే బాధపెట్టింది. తండ్రి యిక లేరు అన్న బాధే మీది. కాలం మీకు తగిలిన గాయాన్ని మాన్పుతుంది.

కాని నా వల్ల ఒక మనిషి ప్రాణం పోయిందన్న బాధ నా గుండెల్ని మండిస్తూంది. ఆ బాధ నన్ను జీవితాంతం వేధిస్తుంది'' అతని కన్నుల నిండుగా నీరు.

''ఇంతకూ మీరు ఏం పనిమీద వచ్చారు?'' సురేష్ అడిగాడు.

''మీ నాన్నగారి ప్రావిడెంట్ ఫండ్, పెన్షను మీ అమ్మగారికి యివ్వడానికి అవసరమైన కాగితాలు తెచ్చాను. మీరు సంతకాలు పెట్టించి యిస్తే వీలైనంత త్వరగా మీకా డబ్బు అందేలా చేస్తాను.''

''ఇక మాకు అర్జెంటుగా అవసరం లేదులెండి. చెల్లాయి పెళ్ళి చేద్దామని అనుకొన్నాం. ఇప్పుడు మాకా ఆలోచన లేదు. మీరు ఎంత లేటు చేయగలరో చేయండి. ఈలోగా మీరడిగిన డబ్బు మేము సమకూర్చుకోవాలిగా'' అన్నాడు సురేష్.

''చచ్చిన పామును ఇంకా చంపకండి. మీరు

సి.ఎన్.చంద్రశేఖర్

నాకు పైసా కూడా యివ్వక్కర్లేదు. దానికోసం మీరు తిరగవలసిన పనికూడా లేదు. మొత్తం నేను పూర్తి చేసి చెక్కు మీ చేతిలో పెడతాను. మీ నాన్నగారి ఆత్మశాంతికి నా వంతుగా ఏదైనా చేయనివ్వండి.''

''ఆయన ఆత్మ శాంతిగానే ఉంటుందండి. ఎప్పుడైతే ఈ అనాగరిక ప్రపంచం నుంచి, మానవత్వం లేని మనుషుల నుంచి వెళ్ళిపోయారో అప్పుడే దొరికింది ఆయనకు శాంతి'' ఈసడింపుగా అంది రాధిక.

''మీరేమన్నా నేను భరిస్తాను. భరించాలి కూడా. నేను వస్తాను. ఓ రెండు రోజుల్లో మళ్ళీ వస్తాను. ఈలోగా అమ్మగారి చేత సంతకాలు పెట్టించి ఉంచండి'' అంటూ లేచాడు శేఖర్.

★ ★ ★

తన ఆఫీసుకు వచ్చిన సురేష్, రాజమ్మలకు చెక్కులు అందజేశాడు శేఖర్.

''చాలా థాంక్సండీ. మీరు మాకు చాలా సహాయం చేశారు'' అన్నాడు సురేష్.

''అలా అనడం మీ గొప్పదనం. సో... మీరు నన్ను క్షమించినట్లే అని అనుకొంటాను. మీరేమీ అనుకోనంటే ఒక మాట''

''చెప్పండి''

''మీ సిస్టర్‌కి పెళ్ళి ప్రయత్నాలేమైనా చేస్తున్నారా. నాకు తెలిసి తండ్రి పోయిన సంవత్సరం లోపల ఆడపిల్ల పెళ్ళి చేస్తే మంచిదని విన్నాను.''

''అవును. నాకూ చెప్పారు. మంచి సంబంధం దొరకాలిగా''

''మీకు అభ్యంతరం లేకపోతే మీ చెల్లెల్ని నేను పెళ్ళి చేసుకొంటాను''

''మీరా?'' ఆశ్చర్యంగా అన్నాడు సురేష్.

''అవును. ఆమెను మొదటిసారి చూసినప్పుడే నాకెంతో నచ్చింది. తర్వాత మీ నాన్నగారి మరణానికి నేను కారణం అయ్యాను కదా అని చింతిస్తూంటే నాకీ ఆలోచన వచ్చింది. మీకు చెక్కులు యివ్వగానే మీకూ నాకూ సంబంధం తీరిపోతుంది. ఆ తర్వాత మీరెవరో, నేనెవరో. మీరెలా వున్నారో, ఏం యిబ్బందులు పడుతున్నారో నాకు తెలియదు. అదే నేను రాధికగారిని చేసుకొంటే మీలో ఒకడిగా ఉంటూ మీ కష్టసుఖాల్లో పాలు పంచుకోవచ్చు. రాధికగారిని నేను ప్రాణప్రదంగా చూసుకుంటాను.''

ఏమంటావన్నట్టు తల్లివైపు చూశాడు సురేష్. అ డ శేఖర్‌తో ''మేము ముందు రాధిక అభిప్రాయం తెలుసుకోవాలి. అది ఒప్పుకొంటే మాకేం అభ్యంతరం లేదు'' అంది.

''తప్పకుండా తెలుసుకోండి. తనకు యిష్టమయితేనే మనం ప్రొసీడ్ అవుదాం. అయితే ఆమెకు ఒక విషయం చెప్పాలి మీరు. నేను లంచం తీసుకోవడం మానేశానని, భవిష్యత్తులో కూడా తీసుకోనని చెప్పాలి. ఆఫీసులో కొన్ని కారణాల వల్ల నేనూ లంచం తీసుకోవాల్సి వచ్చింది. దానివల్ల యిటువంటి పరిణామాలు ఎదురవుతాయని తెలిసుంటే తీసుకొనేవాణ్ణి కాదు. కనీసం యిప్పటికైనా నా తప్పు తెలుసుకొన్నాను. మా ఆఫీసులో అందర్నీ మార్చలేకపోయినా నేను మారాను.''

''మంచి పని చేశావు బాబు. మేము రాధికతో మాట్లాడి మీకు కబురు చేస్తాము. మీ అమ్మా నాన్నా...'' అంది రాజమ్మ.

''అమ్మా, నాన్నా, అక్కా, బావా, చెల్లెలు- మా ఫ్యామిలీ, నా నిర్ణయాన్ని వాళ్ళు కాదనరు''

తల్లీకొడుకులిద్దరూ అతనికి మరోసారి థాంక్స్ చెప్పి శెలవు తీసుకొన్నారు.

రాధికతో శేఖర్ విషయం చెప్పింది తల్లి రాజమ్మ.

''అమ్మా! నీకేమైనా పిచ్చి పట్టిందా? అతను నాన్నను చంపిన హంతకుడు'' కోపంగా అంది రాధిక.

''రాధీ. అతన్ని అటువంటి మాటలు అనవద్దు. అతను తప్పు చేసుండొచ్చు. అంతమాత్రాన నీ తండ్రిని అతను కత్తితో చంపాడా లేక చావాలని కోరుకొన్నాడా? ఆయనకు గుండెపోటు ఎందుకు వచ్చిందో మనకూ తెలియదు. ఆయన్ను భగవంతుడు తీసుకుపోవడానికి అదో కారణం. అంతే. ఆ అబ్బాయి ఎంతో బాధపడ్డాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. మన వెనకే తిరిగి ఎంత సహాయం చేశాడు. ఈ కాలంలో అలా చేసిన తప్పు తెలుసుకొని సరిదిద్దుకొనే వాళ్ళు ఎంత మంది ఉంటారు'' అంది రాజమ్మ.

''ఎందుకో నాకు అతనిపై మంచి అభిప్రాయం కలగడం లేదమ్మా''

సురేష్ కల్పించుకొని ''పోనీలే. వదిలెయ్ రాధీ. నీకిష్టం లేకపోతే వద్దు. కానీ అతను మాత్రం మంచివాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. పైగా అతనే ప్రపోజ్ చేసేసరికి అనుకూలంగా స్పందించాం. నీకు నచ్చిన వాడితోనే నీ పెళ్ళి జరుగుతుంది'' అన్నాడు.

★ ★ ★

గురువారం సాయిబాబా గుడి భక్తులతో నిండి వుంది. దేవుడి దర్శనం చేసుకొని బయటకు వచ్చిన శేఖర్‌కు రాధిక కనబడింది.

''హలో'' అన్నాడు పలకరింపుగా.

''హలో'' అంది నిర్లిప్తంగా.

''రండి... అలా కూర్చుందాం. మీతో ఒక



## నిదానమే ప్రధానం

**బెంగాలీ భామ రీమాసేన్ ఏ సినిమా అంటే ఆ సినిమాని ఒప్పేసుకోవడం లేదట. తెలుగులోలాగే బాలీవుడ్‌లో కూడా ఆమెని వెతుక్కుంటూ కుప్పలుతెప్పలుగా అవకాశాలు వస్తున్నా అన్నింట్లోనూ నటించడం లేదట. ప్రస్తుతం రెండు హిందీ చిత్రాలు మాత్రం చేస్తోంది. మరో నాలుగు సినిమాల్లో నటించడానికి త్వరలో ఒప్పుకుంటానంటోంది రీమాసేన్. నిదానమే ప్రధానం అనే సూత్రాన్ని పాటిస్తోందన్నమాట.**

-మానస

నిమిషం మాట్లాడాలి''.అన్నాడు.

అయిష్టంగానే అతన్ని అనుసరించింది. గుడి ప్రక్కనే ఉన్న చెట్ల క్రిందికి వెళ్ళి కూర్చున్నారు.

''మీ అమ్మగారు విషయం చెప్పారనుకొంటాను. మీరేం నిర్ణయించుకొన్నారు'' అన్నాడు శేఖర్.

''జీవితాలతో ఆడుకొనే వాళ్ళతో జీవితం పంచుకోనని చెప్పాను''

శేఖర్ ముఖం తెల్లగా పాలిపోయింది. ఆమెతో ఏమీ మాట్లాడలేక పోయాడు.

రాధిక ''నేను వస్తాను'' అంటూ లేచి గుడిలోకి వెళ్ళిపోయింది.

శేఖర్ అలాగే కూర్చుండిపోయాడు, ఆమె వెళ్ళిన వైపే చూస్తూ.

గుడిలో శేఖర్‌ను కలిసిన విషయం సురేష్‌తో చెప్పింది రాధిక.

''నా మాటలు విని అతను బాధపడుతుంటే నాకు కసి తీర్చుకున్నానన్న సంతోషం కలిగింది'' అంది.

''తప్పమ్మా. నువ్వు అలా అని ఉండకూడదు. రాధీ. అతను పెళ్ళి ప్రపోజల్ తెస్తే అతను నీకు తగినవాడా, కాదా అనే ఆలోచించాను. కాని యిప్పుడు చెప్తున్నాను. నువ్వు అతనికి తగవు. అతను చేసిన తప్పల్లా లంచం తీసుకోవడం. అదీ యిప్పుడు మానేశాడు. చేసిన తప్పుకి అతను ఎంతగా ఫీలవుతున్నాడో మనం చూస్తూనే వున్నాం. ఇంకో విషయం తెలుసా? తను ఆర్జించిన సొమ్మంతా సాయి బాబా గుడిలో అన్నదాన పథకానికి యిచ్చేసి కొత్త జీవితాన్ని ప్రారంభించానని చెప్పాడు. అటువంటి మంచి మనిషికి నువ్వు తగవు. అతని శ్రేయోభిలాషిగా నేనీ మాట చెప్తున్నాను. మనం వేరే సంబంధం చూసుకొందాం''

షాక్ తిన్నట్లు చూస్తూండిపోయింది రాధిక. తనను ఎంతో ప్రేమించే అన్నయ్య అలా మాట్లాడతాడని ఆమె ఊహించలేదు. అలా మాట్లాడడంటే తప్పు తనలో ఉంది. ఆమెలో ఆలోచన మొదలైంది.

రాధిక ఆరోజు సాయంత్రం సాయిబాబా గుడికి వెళ్ళేసరికి పూజారితో మాట్లాడుతూ కనిపించాడు శేఖర్. రాధికను చూసినా పలకరించలేదు. అతడు వెళ్ళిపోయాక పూజారిని సమీపించి ''ఏమిటి బాబాయ్ అలా ఉన్నారు?'' అని అడిగింది.

''ఇప్పుడు నాతో మాట్లాడాడే ఆ అబ్బాయి షిర్డీ సాయి భక్తుడు. ప్రతి గురువారం గుడికి వస్తున్నాడు. చాలా మర్యాదగా, ఆప్యాయంగా మాట్లాడేవాడు. క్రిందటి నెల తన వల్ల ఓ కుటుంబానికి అన్యాయం జరిగిందని చెప్పి బాధపడ్డాడు. తను దాచుకొన్న డబ్బంతా గుడిపేరుతో బ్యాంకులో వేసి వడ్డీ డబ్బులతో ప్రతి గురువారం పేదలకు అన్నదానం చేయమన్నాడు. సంతోషంగా ఒప్పుకొన్నాను. ఈరోజు చెప్పాడు తను ట్రాన్స్‌ఫర్‌కు అప్లై చేశాడట. యింకో నెలలో వచ్చేస్తుందని, తను మనశ్శాంతి కోసం యీ వూరు వదలి వెళ్ళిపోతున్నానని చెప్పాడు. అతను యిక గుడికి రాడు అనుకొంటే మనసంతా బాధగా వుంది. మంచివాళ్ళకే అన్ని పరీక్షలూ పెడతాడు భగవంతుడు. అయితే ఆ బాబా అతనికి తప్పకుండా మంచి చేస్తాడు. మనశ్శాంతి యిస్తాడు. నాకా నమ్మకం వుంది'' అన్నాడు పూజారి.

చాలాసేపు గుడిలోనే కూర్చుని ఆలోచిస్తూ ఉండిపోయింది రాధిక. అంత మంచివాడిని తన మాటలతో బాధపెట్టినందుకు చింతించింది. తన 'తప్పును' తెలుసుకొని అతను గొప్పవాడైతే అతని తప్పునే విమర్శిస్తూ తను అల్పురాలైంది. మంచిని పెంచడం కంటే మంచిని గుర్తించడం గొప్ప అనుకొంది.

ఇంటికి రాగానే సురేష్‌తో ''అన్నయ్యా. శేఖర్‌గారి ఫోన్ నెంబరు చెప్పు'' అంది.

''ఎందుకు?'' ఆశ్చర్యంగా అడిగాడు సురేష్.

''మీరు నాకు నచ్చారు అని చెప్పడానికి'' సిగ్గుగా అంది రాధిక.

★

## అమీషా టెక్నిక్

**ఈమధ్య అమీర్‌ఖాన్‌ను భట్రాజులా తెగ పొగుడుతోంది అమీషా పటేల్. కారణం అమీర్ ఖాన్- సైమన్ కమీషన్ ఇతివృత్తంగా ఓ భారీ చిత్రాన్ని తీయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుసుకుందిట. అమీర్ ఎంతో తెలివైన వాడు, వెరీ ఇన్నోసెంట్ బాయ్.. అని పొగడ్తల వర్షం కురిపిస్తోంది. 'గదర్' సినిమా కంటే ముందు కూడా ఇలాగే - 'నేను సన్నీ డియోల్ ఫాన్‌ని' అంటూ సన్నీని తెగ పొగిడేసి చాన్స్ కొట్టేసింది. అమీషా అందమైందే కాదు తెలివైంది కూడా.**

-మానస

